జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం
8-8-2026

సంపుటి 1 సంచిక 256

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195




## 102 మంది మహిళలతో 102 బోనాల సమర్పణ

దశ, హైదరాబాద్: కొత్తపేట లోని శ్రీ ప్రసన్న మహంకాళి దేవాలయం నుండి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు 102 మంది మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సుపై ధరించి ఊరేగింపుగా వెళ్లారు. ఈ వేడుకలు మన ఊరి కట్టుబాట్లను, భక్తిభావాన్ని మరియు తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా సాగాయి. మహిళలందరూ కలిసికట్టుగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడం భక్తిపారవశ్యాన్ని, మహిళా సమైక్యతను ప్రతిబింబించింది.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ లెటర్

దశ, హైదరాబాద్: జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

..మిగతా 4వ పేజీలో →



## తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడు?

దశ, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో టీడీపీని మళ్లీ యాక్టివ్ చేయాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయని టీడీపీ.. ఈసారి గ్రేటర్ ఎన్నికల్లో తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిని నియమించి, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం

..మిగతా 4వ పేజీలో →






## వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్లాస్టిక్ కరెన్సీ

దశ, న్యూ ఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ప్రకటించారు. మొదటి విడతగా 10 రూపాయలు 20 రూపాయలు ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను మార్కెట్లోకి విడుదల చేస్తారు. ప్రస్తుతానికి దానికి సంబంధించిన కార్యక్రమాలు అన్ని పూర్తయ్యాయని కేంద్రం ఆమోదించిందని కూడా తెలిపారు.

..మిగతా 4వ పేజీలో →


# 2047 లక్ష్యాలకు యువత, పరిశోధనలే చోదకశక్తి

## ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం చేయాలి: మంత్రి జూపల్లి



దశ, హైదరాబాద్: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలే కీలకమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కన్హా శాంతివనంలో పాలమూరు విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజన్ ఇండియా-2047' జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. AI, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలని జూపల్లి సూచించారు. శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహిస్తూ యువశక్తిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్పొరేట్ విద్య, వైద్యం కోసం అధిక ఖర్చులు చేయడం, కుటుంబ వేడుకల్లో ఆడంబరాలకు పోవడం వల్ల అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్య సేవలను బలోపేతం చేయడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అప్పుల ఊబి నుంచి బయటపడేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు స్వయం సమృద్ధికి దోహదపడాలని జూపల్లి అన్నారు. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు త్వరలో ప్రభాత భేరి

..మిగతా 4వ పేజీలో →




## ఎన్‌ఓసీ కోసం ఫోర్జరీ.. అడ్డంగా బుక్కైన కాలేజీలు

- హైడ్రా నిబంధనలకు కాలేజీల తూట్లు
- నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల గుట్టురట్టు
- ఫైర్ సేఫ్టీపై కాలేజీల మోసం
- 60 కాలేజీల ఎన్‌ఓసీలపై స్క్రూటినీ

దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఏకంగా హైడ్రా పేరుతోనే మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. కాలేజీలకు అవసరమైన ఫైర్ ఎన్‌ఓసీలను పొందేందుకు హైడ్రా అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, వాటిని ఇంటర్ బోర్డుకు సమర్పించినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. నగరంలో చెరువులు, కుంటలు, నాలాలు,

..మిగతా 4వ పేజీలో →



## ఎస్ఐఆర్‌కు మరో మూడు రోజులే గడువు

దశ, రంగారెడ్డి : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనున్నందున అర్హులైన ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి కోరారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని వారు తమ పరిధిలోని BLOలను సంప్రదించి ఆగస్టు 10లోపు ఫారాలు అందజేయాలని సూచించారు.

..మిగతా 4వ పేజీలో →

## ఈ నెల 10వ తేదీన సాగార్జునసాగర్‌లో వరుణ యాగం

### పాల్గొంటున్న సీఎం రేవంత్ రెడ్డి



దశ, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఈ నెల 10వ తేదీన సాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు.

..మిగతా 4వ పేజీలో →

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల



దశ, హైదరాబాద్: చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరించారు. అనంతరం 100కు పైగా స్టాళ్లతో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు.

..మిగతా 4వ పేజీలో →



## టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ పేర్లపై విద్యాశాఖ నిఘా

దశ, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల పేర్లలో 'ఇంటర్నేషనల్', 'టెక్నో', 'ఒలింపియాడ్', 'టాలెంట్', 'మోడల్' వంటి పదాల వినియోగంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ప్రభుత్వం 2009లో జారీ చేసిన జీవో నెం.91 ప్రకారం.. ఇతర పాఠశాలల కంటే మెరుగైన విద్య అందిస్తున్నట్లు తల్లిదండ్రుల్లో తప్పుడు అభిప్రాయం కలిగించే పదాలను స్కూల్ పేర్లలో ఉపయోగించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ పలు జిల్లాల్లో ఈ పదాలతోనే పాఠశాలలు కొనసాగుతున్నట్లు అధికారిక డేటా ఆధారంగా నిర్వహించిన విశ్లేషణలో వెల్లడైంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 3,697 పాఠశాలల్లో కనీసం 601 స్కూళ్లు నిషేధిత పదాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పదాలను పేర్లలో కొనసాగిస్తున్నట్లు తేలింది.

..మిగతా 4వ పేజీలో →



## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్: మంత్రి శ్రీధర్ బాబు

దశ, హైదరాబాద్: సోమాజిగూడ ఐటీసీ కాకతీయ హోటల్ లో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్-తెలంగాణ"ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు.

..మిగతా 4వ పేజీలో →

## ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



దశ, హైద్రాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లించాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో

..మిగతా 4వ పేజీలో →

## వరిపై ఆధారపడొద్దు.. ప్రత్యామ్నాయ పంటలే మేలు



**దశ, రంగారెడ్డి:** ఈ నెల 15 తర్వాత వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు పంటల ఎంపికపై సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు, అధికారుల సూచనలు పాటించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

## చేనేత సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**దశ, ఓయూ:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి (ఎస్ఎల్ఎన్ఎస్) సిల్క్ సొసైటీ అధ్యక్షుడు గుండు అమరేష్ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి చేనేత కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సిల్క్ సొసైటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు యాదగిరిగుట్టలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. చేనేత కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, చేనేత కళాకారులు, సిల్క్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఒట్టే జానయ్య యాదవ్ ఆచూకీ తెలపండి

❖ తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి



**దశ, నల్గొండ :** వట్టే జానయ్య యాదవ్ ఆచూకీ తెలియజేయాలని తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి పోలీస్ శాఖను డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోరాట సమితి అధ్యక్షుడు రాములు యాదవ్ మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో బీసీల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవుల పట్ల రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని అన్నారు. జానయ్య తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కానీ ఇలా వేధింపులకు గురి చేయటం ఏమిటని ప్రశ్నించారు. అగ్రకులాలకు చెందిన రైస్ మిల్లర్ల పట్ల ప్రభుత్వం ఇదే తీరులో వ్యవహరిస్తుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జానయ్య ఆచూకీ చెప్పాలా పోలీస్ శాఖను ఆదేశించాలని డిమాండ్ చేశారు.

## కన్నుల పండుగగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** శ్రీవల్లిదేవసేనసమేతసుబ్రమణ్యస్వామికళ్యాణమహోత్సవం ఆషాడ మాసంలో ఆడికృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప, ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం 54 ద్రవ్యాలతో శాస్త్రోక్తకంగా ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ, దాములూరి సతీష్ శర్మ, ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదానం దాతలు మడిపెద్ది యాకయ్య, మహాభిషేకం దాతలు చల్ల లక్ష్మీకాంత్ శృతి దంపతులు, ఆలయం చైర్మన్ అనంతుల గణేష్‌రామలింగయ్య, ఆలయ ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, పెద్దిరెడ్డి భరత్, వాసా కృష్ణ, చెన్నూరి వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అర్చకులు దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్య సేవా బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ అర్బన్ బీజేపీ అధ్యక్షుడికి గోపాల్ గౌడ్ అభినందనలు



**దశ, ఓయూ:** మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన గిరివర్ధన్ రెడ్డిని జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేడ్చల్ అర్బన్ జిల్లా పరిధిలో అత్యధిక స్థానాలు గెలిపించి, మేయర్ పదవిని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని అన్నారు. గోపాల్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం గోపాల్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని గిరివర్ధన్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన శేఖర్ యాదవ్‌ను గోపాల్ గౌడ్ శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ కార్మిక విభాగ జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జవాజీ శ్రీధర్ రెడ్డి, గందమల గోపి, క్రాంతి కుమార్, మంజులవాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

# గేట్లు లేకుండానే వరద నీటి విడుదల

❖ సరళా సాగర్ ప్రాజెక్టు ప్రత్యేకత



**దశ, వరంగల్:** వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు) పై నిర్మించిన సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నంగా నిలుస్తోంది. గేట్లు ఎత్తడం, విద్యుత్ వినియోగించడం, నిరంతరం మానవ పర్యవేక్షణ అవసరం లేకుండానే నీటి మట్టాన్ని నియంత్రించే సైఫన్ ఆధారిత వ్యవస్థ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

1940ల చివర్లో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ సాంకేతికతను పరిశీలించిన అనంతరం, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన తల్లి సరళాదేవి పేరు మీద ప్రాజెక్టుకు సరళా సాగర్ అని నామకరణం చేశారు. 1949లో పనులు ప్రారంభమై 1959లో ప్రాజెక్టు పూర్తయింది. సరళా సాగర్ ప్రత్యేకత దాని ఆటోమేటిక్ సైఫన్ వ్యవస్థలో ఉంది. సాధారణ ప్రాజెక్టుల్లో నీటి మట్టం పెరిగినప్పుడు గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తారు. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని సైఫన్ గొట్టాలు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం నిర్ణీత స్థాయికి చేరినప్పుడు సైఫన్ వ్యవస్థ పనిచేసి, నీటిని దిగువకు విడుదల చేస్తుంది. నీటి మట్టం తగ్గినప్పుడు వ్యవస్థ స్వయంచాలకంగా ప్రవాహాన్ని నిలిపివేస్తుంది.

సుమారు 0.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు దాదాపు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందిస్తూ స్థానిక రైతులకు ఉపయోగకరంగా నిలుస్తోంది. విద్యుత్ అవసరం లేకుండా పనిచేయడం, యాంత్రిక నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం, నీటిని స్వయంచాలకంగా విడుదల చేయడం వంటి అంశాలు దీని ప్రత్యేకతలు.

గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి భౌతిక శాస్త్ర సూత్రాలను ఉపయోగించుకుని పనిచేసే ఈ వ్యవస్థ దశాబ్దాలుగా కొనసాగడం ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వహణ వ్యయాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సరళా సాగర్ వంటి తక్కువ నిర్వహణతో పనిచేసే నీటి నిర్వహణ నమూనాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. సరళా సాగర్ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాకుండా.. విదేశీ సాంకేతికతను స్థానిక అవసరాలకు అనుగుణంగా మలిచి, ప్రకృతి శక్తులను సమర్థంగా వినియోగించిన అరుదైన ఇంజనీరింగ్ ప్రయోగంగా నిలిచింది.




## దోమల నిర్మూలనకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

**దశ, చౌటుప్పల్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన, వాణిజ్య సంస్థల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండే అవకాశమున్న పాత టైర్లను తొలగించి, దోమల వ్యాప్తిని నివారించే చర్యలు చేపట్టారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే వస్తువులు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, ప్లాస్టిక్ పాత్రలు తదితరాలను వెంటనే తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొని ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

## లడ్డూ వేలంలో రూ.51 లక్షలు.. చివరకు రూ.3.45 కోట్లు స్వాహా!




**దశ, హైదరాబాద్:** వినాయకుడి లడ్డూను రూ.51 లక్షలకు వేలంలో దక్కించుకుని..అందరికీ ప్రసాదం పంచి నమ్మకం సంపాదించాడు. ఆ తర్వాత అదే నమ్మకాన్ని పెట్టుబడుల పేరుతో క్యాష్ చేసుకుని ఏకంగా రూ.3.45 కోట్లు వసూలు చేసి పరారైన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. మైహోమ్ భుజలో నివసించే కొండపల్లి గణేష్ గతేడాది వినాయక చవితి సందర్భంగా రూ.51 లక్షలు చెల్లించి లడ్డూను వేలంలో దక్కించుకున్నాడు. ఖరీదైన లడ్డూ కొనడంతో పాటు అపార్ట్‌మెంట్‌లోని వారందరికీ ప్రసాదం పంచడంతో అతడిపై చాలామందికి నమ్మకం ఏర్పడింది. ఈ పరిచయాలను ఆసరాగా చేసుకున్న గణేష్.. తనకు వ్యాపారాలు ఉన్నాయని, పెట్టుబడి పెడితే 6 శాతం లాభం ఇస్తానంటూ పలువురిని నమ్మించినట్లు బాధితులు ఆరోపించారు. దీంతో పలువురు లక్షల రూపాయలు అతడికి అందజేశారు. సిల్వియా, ఆమె భర్త శ్రీనివాసరెడ్డి దంపతులు మాత్రమే రూ.30 లక్షలకు పైగా ఇచ్చినట్లు సమాచారం. ఇలా ఐదుగురి నుంచి మొత్తంగా రూ.3.45 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గడువు ముగిసినా లాభాలు ఇవ్వకపోవడంతో బాధితులు నిలదీయడం ప్రారంభించారు. ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా తప్పించుకున్న గణేష్.. గత ఏప్రిల్‌లో కిరణ్‌తో కలిసి మైహోమ్ భుజలోని ఇల్లు ఖాళీ చేసి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సైబరాబాద్ ఈఓడబ్ల్యూలో కేసు నమోదైంది. గణేష్‌తో పాటు అతనికి సహకరించిన కిరణ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. రూ.51 లక్షల లడ్డూ వెనుక ఇంత పెద్ద మోసం దాగి ఉండటంతో ఈ ఘటన హైదరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

## మూసీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌరెల్లి-ప్రతాప్‌సింగారం మూసీ వంతెన వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మూసీ నుంచి బయటకు తీశారు. మృతుడి వయసు సుమారు 35-40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. నీలిరంగు జీన్స్ ప్యాంట్, గోధుమరంగు షర్ట్ ధరించి ఉన్నట్లు వెల్లడించారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక మూసీ ప్రవాహంలో కొట్టుకువచ్చాడా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## 'మూసీ తరంగాలు– సింహవాహిని శతకం' ఆవిష్కరణ



**దశ, హైదరాబాద్:** మూసీ నది ప్రాశస్త్యం, హైదరాబాద్ బోనాల వైభవాన్ని వివరిస్తూ జర్నలిస్ట్, కవి వరకాల యాదగిరి రచించిన 'మూసీ తరంగాలు-సింహవాహిని శతకం' పుస్తకాన్ని మాసబ్ ట్యాంక్ లోని మూసీ పునర్జీవన సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, మూసీ పునర్జీవన సంస్థ ఎండీ ఈ. వెంకట నరసింహారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజంతో పాటు పద్య సాహిత్యంలోనూ యాదగిరి తన ప్రతిభను చాటుకున్నారని అభినందించారు. వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మూసీ నది చరిత్ర, హైదరాబాద్ బోనాల సంప్రదాయాలను పద్యరూపంలో అందించడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం నగర వారసత్వాన్ని నేటి తరానికి పరిచయం చేస్తుందని అన్నారు. రచయిత వరకాల యాదగిరి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా మూసీ నది, హైదరాబాద్ చరిత్ర, సంస్కృతిని పరిశీలించిన అనుభవంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మూసీ పునర్జీవన సంస్థ డైరెక్టర్ విష్ణువర్ధన్ రావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.




## రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఉన్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఐఏఎస్ శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్, గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీళ్లను పరిశీలించారు. అలాగే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ (VVPAT) యంత్రాలు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న SIR ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

దశ, ఓయూ: రానున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'హర్ ఘర్ తిరంగా-ఘర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఉప్పల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గ స్థాయి సమావేశం మేడ్చల్-మల్కాజిగిరి (అర్బన్) జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు నివాసంలో నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర పార్టీ పరిశీలకురాలిగా పాల్గొన్న కొల్లి మాధవి మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో సంక్షేమ సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో తిరంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 10న ప్రతి కార్యకర్త తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని, ఆగస్టు 13, 14, 15 తేదీల్లో అన్ని డివిజన్‌లలో భారీగా తిరంగా ర్యాలీలు చేపట్టి స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువజన సంఘాలతో కలిసి జాతీయ జెండాలను పంపిణీ చేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌరిగే కృష్ణ, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, దేవసాని బాలచందర్, పోతగాని గోపాల్ గౌడ్, మల్యాల సతీష్‌కుమార్, తిండేరు హనుమంతరావు, అంబటి వెంకటాచలం, జీవీఎన్ రావు, రవీంద్రసాగర్, శాంతి కిరణ్, సంధ్యారెడ్డి, రాంప్రదీప్, ఎల్లాచారి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓయూ క్యాంపస్‌లో డీకాయ్ ఆపరేషన్లు..

## మద్యం, ధూమపానంపై పోలీసుల ప్రత్యేక నిఘా



దశ, ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, నిషేధిత ప్రాంతాల్లో ధూమపానం చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ఓయూ సిటీ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకోసం పగలు, రాత్రి వేళల్లో డీకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ నిఘా ముమ్మరం చేశారు. యెల్లమ్మ దేవాలయం, ఎన్‌సీసీ గేట్, 100 ఇయర్స్ పైలాన్, ఆర్ట్స్ కాలేజ్ బస్ స్టాప్, ఎన్‌ఆర్‌ఎస్ హాస్టల్ పరిసరాలు, మైక్రోబయాలజీ విభాగం, హైటెక్ హాస్టల్, అడ్మినిస్ట్రేషన్ భవనం తదితర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల క్యాంపస్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన బయటి వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో బయటి వ్యక్తులతో పాటు యూనివర్సిటీ విద్యార్థులు, ఇన్‌సైడర్స్‌పైనా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, నిషేధిత ప్రాంతాల్లో ధూమపానం చేయడం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంపస్‌లో ప్రశాంతత, భద్రత, క్రమశిక్షణ పరిరక్షణకు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఓయూ సిటీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, సెక్టర్ ఎస్సై జయ చందర్, ఓయూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దశ, ఓయూ: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నాచారం పోలీస్ స్టేషన్ సీఐ దనుంజయ్ సూచించారు. మల్లాపూర్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో శుక్రవారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1 గురుబెల్లి సోమశంకర్ సునీల్ బాబు ఆధ్వర్యంలో, ఎస్ఎస్ఎస్ యువసేన సహకారంతో మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ భద్రత, మహిళల రక్షణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ దనుంజయ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగ పరిమితులు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. ఎస్ఐ మైబెల్లి మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవ భావం కలిగి వారి భద్రతకు సహకరించాలని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, సందేశాలను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుమారు 120 నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులతో విద్యార్థులు పరస్పర చర్చ నిర్వహించి పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో మామిడాల సంతోష్ రెడ్డి, బాలరాజ్, కపర సాయి, గురు, అక్షంత్ పడాల, జోషిత్ యాదవ్, రామ్ పుప్పాల, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ప్రాజోలమ్ సరఫరా కేసులో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వెంకటేష్ గౌడ్ అరెస్ట్

- కల్లు కాంపౌండ్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పట్టుకున్న రాచకొండ ఈగిల్ ఫోర్స్
- ఆరుగురి అరెస్ట్.. ₹25 లక్షల విలువైన అల్ప్రాజోలమ్, ₹5.45 లక్షల నగదు స్వాధీనం



దశ, ఓయూ: కల్లు కాంపౌండ్లకు అక్రమంగా అల్ప్రాజోలమ్ నిద్రమాత్రల పౌడర్‌ను సరఫరా చేస్తున్న ముఠా గుట్టును రాచకొండ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ (ఈగిల్ ఫోర్స్) అధికారులు రట్టు చేశారు. ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వెంకటేష్ గౌడ్‌తో పాటు మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిఘా..పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం— అల్ప్రాజోలమ్‌ను విచ్చలవిడిగా బల్క్‌గా కొనుగోలు చేసి, వివిధ కల్లు కాంపౌండ్లకు సరఫరా చేస్తున్నట్లు రాచకొండ నార్కోటిక్స్ పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన ఈగిల్ ఫోర్స్ బృందం మచ్చబొల్లారం - రుక్మిణి ఎన్‌క్లేవ్ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసింది. అక్కడ అక్రమ డ్రగ్స్ లావాదేవీలు జరుగుతున్న సమయంలో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్ట్ అయిన వారిలో సికింద్రాబాద్‌లోని లాలాపేటకు చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వెంకటేష్ గౌడ్ ఉన్నట్లు పోలీసులు అధికారిక ప్రకటనలో ధృవీకరించారు.

**₹25 లక్షల సరుకు, నగదు సీజ్**

ఈ దాడి సందర్భంగా నిందితుల నుంచి 1.189 కిలోల అల్ప్రాజోలమ్ పౌడర్ (దీని విలువ మార్కెట్‌లో సుమారు ₹25 లక్షలు ఉంటుంది) మరియు ₹5.45 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరినీ న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో తీవ్ర చర్చ ప్రజావిశ్వాసాన్ని కాపాడాల్సిన రాజకీయ పార్టీ కీలక నాయకుడు డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో చిక్కుకోవడం తార్నాక, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపింది. అయితే ఈ వ్యవహారంపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయస్థానాల విచారణ అనంతరం కేసు పూర్తి వివరాలు వెల్లడవుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు వినతి



దశ, ఓయూ: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజుల చెల్లింపుల కోసం కళాశాలల నుంచి ఒత్తిడి పెరగడంతో విద్యాభ్యాసం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు చెరుకు శివరాజ్, సమితి కార్యదర్శి మాలోత్ రవి కుమార్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా అనేక మంది విద్యార్థులు పరీక్షలు రాయడం, సర్టిఫికెట్లు పొందడం, ఉన్నత విద్య కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మంద మిట్టు, మంద నీలేష్, మంద మణిందర్, బోడ వెంకట్, తాళ్లపెల్లి సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం..

## వెనుకబడిన వార్డులపై ప్రత్యేక దృష్టి : సర్వోత్తమ్ రెడ్డి, నివేదిత లక్షాది.



దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ముఖ్యంగా వెనుకబడిన వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 25వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష-శివ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్, కల్వర్టుల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యంతో పాటు ప్రతి వార్డు సమానంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా, ఈ నెల 15వ తేదీలోపు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు సుమారు 1.05 కోట్ల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# TET అర్హత మార్కులపై సడలింపు ఇవ్వాలి: శివారెడ్డి

దశ, ఓయూ: TETలో 90 మార్కుల అర్హత నిబంధన కారణంగా అనేక మంది అభ్యర్థులు DSC నియామకాలకు అర్హత కోల్పోతున్నారని EWS (ఎకనామికల్ వీకర్ సెక్షన్) ఓయూ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు శివారెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతోందని పేర్కొన్నారు. TET అర్హత విషయంలో ప్రభుత్వం సడలింపు ప్రకటించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 60 మార్కుల కటాఫ్, నెగెటివ్ మార్కింగ్ విధానం అమలు చేశారని, ఫలితాల అనంతరం జరిగిన ఆందోళనలతో కొన్ని రిజర్వేషన్ కేటగిరీలకు కటాఫ్ తగ్గించినప్పటికీ EWS అభ్యర్థులకు మాత్రం ఆ అవకాశం కల్పించలేదని విమర్శించారు. ప్రస్తుత కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో కూడా కొన్ని రిజర్వేషన్ కేటగిరీలకు తక్కువ మార్కుల ప్రమాణాలు అమలు చేస్తున్నప్పటికీ, EWS అభ్యర్థులను ఓపెన్ కేటగిరీతో సమానంగా పరిగణించడం వల్ల ప్రిలిమినరీ దశలోనే అనేక మంది నష్టపోతున్నారని అన్నారు. EWS అభ్యర్థులకు కూడా రిజర్వేషన్ నిబంధనలను సముచితంగా అమలు చేసి, ప్రస్తుత కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో న్యాయం చేయాలని, పేదలు, గ్రామీణ నిరుద్యోగ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్




దశ, ఓయూ: తెలంగాణలోని ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 12 ప్రైవేట్, 5 డీమ్డ్ విశ్వవిద్యాలయాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విద్య, ఉపాధి అవకాశాల్లో సామాజిక న్యాయం సాధించాలంటే ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లోనూ రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు. రిజర్వేషన్లు అమలు చేయని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 13న జనవిహార్‌లో మేధావులు, విద్యార్థి, ప్రజా సంఘాలతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని విస్తరిస్తామని తెలిపారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పాలన, ఫీజుల నియంత్రణ, నియామకాలలో పారదర్శకత తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించే యూనివర్సిటీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.



## హైదరాబాద్‌లో 'నో టాలరెన్స్' జోన్లు.. ట్రాఫిక్ రద్దీకి చెక్

**దశ, హైదరాబాద్:** నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టేందుకు అధికారులు కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌ను అరికట్టేందుకు అత్యంత రద్దీ ప్రాంతాలను *'నో టాలరెన్స్ జోన్లు'*గా ప్రకటించే ప్రతిపాదనను అధికారులు ముందుకు తీసుకొచ్చారు. ఈ ప్రాంతాల్లో అక్రమంగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పురపాలక శాఖ ఆదేశాల మేరకు బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధ్యక్షతన హుమ్టా వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, హుమ్టా ఎండీ బి. జీవన్‌బాబు, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పలు చర్యలపై చర్చించారు.

రద్దీ ప్రాంతాల్లో మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలను పెంచాలని నిర్ణయించారు. చార్మినార్ బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న పార్కింగ్ కాంప్లెక్స్ తరహాలో నెక్లెస్ రోడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పీపీపీ విధానంలో పార్కింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించనున్నారు. ప్రధాన రహదారులపై నియంత్రిత ఆన్‌స్ట్రీట్ పార్కింగ్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పాదచారుల భద్రతకు సంబంధించి ఆరాంఘర్ చౌరస్తాలో స్కైవాక్, బండ్లగూడ ఆరె మైసమ్మ దేవాలయం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. అత్తాపూర్ ఆరాంఘర్ రహదారి విస్తరణతో పాటు మెహిదీపట్నంపంజాగుట్ట కూకట్‌పల్లి, నానల్‌నగర్‌టోలిచౌకి మార్గాల్లో ఆక్రమణలను తొలగించి నిరంతర కాలిబాటలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అలాగే సమస్యాత్మక యూటర్న్‌ల వద్ద బారికేడ్లు, డివైడర్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా స్కైవాక్‌లేదా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై పరిశీలన జరుగుతోంది. రద్దీ కూడళ్లలోని 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భ కేబుళ్లుగా మార్చే ప్రతిపాదన కూడా చర్చకు వచ్చింది. తుది ఆమోదం అనంతరం ఈ చర్యలను దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది.

# లెక్క తేలింది..

## ఎస్ఐఆర్‌లో 56 లక్షల ఓటర్ల గుర్తింపు



### మరో 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాలు పెండింగ్.. ఆగస్టు 10 తర్వాతే తుది లెక్క

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) తుది దశకు చేరుకుంది. ఇప్పటివరకు సుమారు 56 లక్షల మంది ఓటర్లను తొలగింపునకు గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరో 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటైజేషన్‌కు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఫారాల పరిశీలన పూర్తయిన తర్వాత తొలగింపునకు గుర్తించిన ఓటర్ల సంఖ్యలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో మొత్తం సుమారు 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం తొలగింపునకు గుర్తించిన 56 లక్షల మంది మొత్తం ఓటర్లలో సుమారు 16.5 శాతంగా ఉన్నారు. అయితే ఈ సంఖ్య తాత్కాలికమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న 19 లక్షల ఫారాల డిజిటైజేషన్, పరిశీలన పూర్తయిన తర్వాతే తుది గణాంకాలు వెల్లడికానున్నాయి.

**34.2 లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలింపు**

ఎస్ఐఆర్‌లో తొలగింపునకు గుర్తించిన వారిలో అత్యధికంగా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరి సంఖ్య సుమారు 34.2 లక్షలుగా ఉంది. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో సుమారు 10.1 శాతం. అలాగే 8.9 లక్షల మంది మరణించినట్లు గుర్తించారు. మరో 6.3 లక్షల మంది ఇచ్చిన చిరునామాల్లో లేని లేదా గుర్తించలేని ఓటర్లుగా నమోదు చేశారు. అదనంగా 6.2 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లు లేదా ఇప్పటికే మరో ప్రాంతంలో ఓటరుగా నమోదైనవారిగా గుర్తించినట్లు సమాచారం.

**హైదరాబాద్‌లో పెండింగ్ ఫారాలు అధికం**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్ విషయంలో హైదరాబాద్ మహానగర పరిధిలోని పట్టణ నియోజకవర్గాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా డిజిటైజేషన్‌కు పెండింగ్‌లో ఉన్న ఫారాల సంఖ్య కూడా ఆయా ప్రాంతాల్లో అధికంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఆగస్టు 10 తర్వాతే తుది లెక్క**

ప్రస్తుతం 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఆగస్టు 10లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతరం సంబంధిత ఓటర్ల వివరాలను పరిశీలించి.. వారు అర్హులా? కాదా? అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## సీఎం రేవంత్ కు కేటీఆర్ లెటర్

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు

## తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడు?

**మొదటి పేజీ తరువాయి**

చేయాలని అధినేత చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు మాజీ నేతలు తిరిగి టీడీపీలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అధ్యక్ష పదవి కోసం పలువురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి. నందమూరి కుటుంబానికి చెందిన సుహాసిని, అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులు రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముందుగా బలమైన నాయకులను పార్టీలోకి తీసుకొచ్చి, ఆ తర్వాత అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ ఎన్నికల్లో జనసేన కూడా రంగంలోకి దిగే అవకాశం ఉండటంతో టీడీపీ వ్యూహం ఆసక్తికరంగా మారింది.

## 2047 లక్ష్యాలకు యువత, పరిశోధనలే చోదకశక్తి

**మొదటి పేజీ తరువాయి**

కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తల తయారీకి కేంద్రాలుగా ఎదగాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం-విశ్వవిద్యాలయాలు-పరిశ్రమల మధ్య సమన్వయంతో యువతకు విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని జూపల్లి తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్, మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే నాలుగు స్తంభాలతో సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల

**మొదటి పేజీ తరువాయి**

ఈ ప్రదర్శన ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగుతుందని, ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని మంత్రి కోరారు. చేనేత భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని తుమ్మల పేర్కొన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట, సిద్దిపేట తదితర ప్రాంతాల చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. నేతన్న భద్రత పథకం కింద రూ.5 లక్షల బీమా, చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు, నేతన్న భరోసా కింద రూ.15 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ దూడం వెంకట్ రమణ, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఎల్ నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ..

**మొదటి పేజీ తరువాయి**

వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణపై సమీక్షించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాలు నిర్వహించి జలాశయాల్లో నీటి లభ్యతపై రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని తుమ్మల సూచించారు. కంటింజెన్సీ క్రాప్ ప్లాన్‌ను మండల, గ్రామ స్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సురేష్ మోహన్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట నారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారులు వనజాత, హరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, విద్యాశాఖ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు మరో మూడు రోజులే గడువు

**మొదటి పేజీ తరువాయి**

ఇప్పటికే ఓటర్లుగా నమోదైన వారు కూడా పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను పరిశీలించుకుని తప్పులుంటే సరిచేసుకోవాలని తెలిపారు. చివరి రోజు రద్దీని నివారించేందుకు ముందుగానే ఫారాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలపై వచ్చే వదంతులను నమ్మకుండా అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని కోరారు.

## వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్లాస్టిక్ కరెన్సీ

**మొదటి పేజీ తరువాయి**

వంద కోట్ల రూపాయల విలువైన 10, 20 రూపాయలు కరెన్సీ మార్కెట్లోకి విడుదల చేసి కొంతకాలం పాటు దాని చలామణి, నాణ్యత చూసి ఆ తర్వాత మిగిలిన నోట్ల విషయంలో కూడా అదే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాగితపు కరెన్సీ కంటే ప్లాస్టిక్ కరెన్సీనే నిర్వహణ మరియు ఖర్చుల రీత్యా మంచిదన్నది తమ అధ్యయనంలో తేలిందని అన్నారు. లైట్ పాలిమర్ మెటీరియల్ తో దాన్ని తయారు చేయబోతున్నట్టు చెప్పారు.

## ఈ నెల 10వ తేదీన సాగార్జునసాగర్‌లో వరుణ యాగం

**మొదటి పేజీ తరువాయి**

నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు, నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహిస్తారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరుగుతుంది. యాగం అనంతరం మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

## టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ పేర్లపై విద్యాశాఖ నిఘా

**మొదటి పేజీ తరువాయి**

వీటిలో 'మోడల్' అనే పదం 210 పాఠశాలల్లో, 'టాలెంట్' 73, 'ఇంటర్నేషనల్' 72 పాఠశాలల్లో ఉన్నట్లు గుర్తించారు. 'కాన్సెప్ట్', 'ఎక్సలెన్స్', 'బ్రిలియంట్', 'క్రియేటివ్' వంటి పదాల వినియోగం కూడా కనిపించింది. ఈ పేర్లను ఉపయోగించడం వల్ల తల్లిదండ్రుల్లో పాఠశాలలపై అధిక నాణ్యత ఉన్నదనే భావన ఏర్పడి, అధిక ఫీజులు వసూలు చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం గతంలో పేర్కొంది. అయితే నిబంధనలు జారీ చేసి దాదాపు 17 ఏళ్లు గడిచినా పూర్తిస్థాయిలో అమలు కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యావేత్తలు మాత్రం పాఠశాల పేరు ఆధారంగా నాణ్యతను అంచనా వేయవద్దని సూచిస్తున్నారు. బోధనా ప్రమాణాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నాణ్యత, విద్యార్థుల ఫలితాలను పరిశీలించిన తర్వాతే తల్లిదండ్రులు పాఠశాలను ఎంపిక చేసుకోవాలని చెబుతున్నారు. మరోవైపు నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలకు గతంలో నోటీసులు జారీ చేశామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కొత్తగా గుర్తింపు కోసం వచ్చే పాఠశాలలకు నిషేధిత పదాలతో పేర్లు పెట్టేందుకు అనుమతి ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

## రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల పెనాల్టీ!

### చిన్న కాంట్రాక్టర్లపై వేధింపులపై మంత్రుల ఆగ్రహం



**దశ, ఆదిలాబాద్:** రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు అధిక పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం దారుణమని కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల సమస్యలపై జరిగిన సమీక్షలో మంత్రులు మాట్లాడారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడేవారిని వదిలేసి.. రోడ్ల పనులు చేసే కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మైనింగ్ శాఖ అధికారులు ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో కాంట్రాక్టర్లను వేధించవద్దని మంత్రి వివేక్ ఆదేశించారు. హ్యామ్ మోడల్‌లో చేపడుతున్న రహదారి పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో మెరుగైన రహదారులు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి తెలిపారు.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్...

**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా తెలంగాణలో డిజిటల్ పాలనను మరింత బలోపేతం చేసేందుకు త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్ను ప్రారంభిస్తామని తెలిపారు. బ్లాక్చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ సేవలు, 20కి పైగా శాఖలను అనుసంధానించే రియల్టైమ్ గవర్నమెంట్ డ్యాష్బోర్డ్ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

## నాణ్యమైన సమాచారాన్ని పకడ్బందీగా సేకరించాలి.



**దశ, రంగారెడ్డి:** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (DCHB) రూపకల్పనకు క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వ్యవసాయం, బ్యాంకింగ్ తదితర రంగాలకు సంబంధించిన వివరాలను నాణ్యతా ప్రమాణాలతో నమోదు చేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పౌర సదుపాయాల వివరాలను DCHB పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా సమాచార సేకరణను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఓసీ కోసం ఫోర్జరీ..

# అడ్డంగా బుక్కైన కాలేజీలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి రక్షించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో, కొందరు విద్యాసంస్థల నిర్వాహకులు నిబంధనలను తప్పించుకునేందుకు ఏకంగా అధికారుల సంతకాలనే ఫోర్జరీ చేయడం తీవ్ర చర్చకు దారితీసింది.

విచారణలో ఫైర్ ఎన్ఓసీలపై సంతకాలు నకిలీవని గుర్తించిన అధికారులు.. సంబంధిత కాలేజీలపై చర్యలకు ఉపక్రమించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ ఎనిమిది కాలేజీల నిర్వాహకులపై లేక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

బర్కత్పురాలోని హైందవి జూనియర్ కాలేజీ, ఎస్ఆర్ నగర్‌లోని రెసోనెన్స్ జూనియర్ కాలేజీ, మెహదీపట్నంలోని ప్రియాంక జూనియర్ కాలేజీ, విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ, చాంద్రాయణగుట్టలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, చిక్కడపల్లిలోని న్యూ ఎరా కాలేజీ, శివరాంపల్లిలోని షాహీన్ జూనియర్ కాలేజీ, తెల్లాపూర్‌లోని వశిష్ట జూనియర్ కాలేజీల పేర్లు ఈ కేసులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మరోవైపు మరికొన్ని కాలేజీల ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. సుమారు 60 కాలేజీలకు సంబంధించిన ఎన్ఓసీలను స్క్రూటినీ చేస్తున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. నిబంధనలు పాటించకుండా ఫైర్ ఎన్ఓసీ పొందేందుకు ప్రయత్నించినట్లు తేలితే ఆయా సంస్థలపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

కాలేజీల భవన భద్రత, అగ్నిమాపక నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తుండటంతో.. నిబంధనలను తప్పించుకునేందుకు కొందరు యాజమాన్యాలు నకిలీ పత్రాల మార్గాన్ని ఎంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఇలాంటి అక్రమాలకు పాల్పడే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com